సాక్షి
మహబూబాబాద్
గురువారం | 18 | జనవరి | 2024



**దేవుడి ఇత్తడి వాహనాల అపహరణ**
దేవుడి సేవలకు వినియోగించే ఇత్తడి వాహనాలను గుర్తు తెలియని దుండగులు అపహరించిన ఘటన మరిపెడ మండలం గుండెపుడి రామాలయంలో జరిగింది. - 10లో▸



**జాతర పనుల నాణ్యతలో రాజీలేదు**
మేడారం జాతర అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీపడే ప్రసక్తే లేదని, నాణ్యతగా ఉంటేనే బిల్లులు చెల్లిస్తామని మంత్రి సీతక్క అన్నారు. - 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$33.8^0$/$18.4^0$

**వాతావరణం**
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు కాస్త మంచు కురుస్తుంది.

# ఆక్రమణలపై ఆరా..

**మానుకోటలో భూ కబ్జాలపై జిల్లా పాలనాధికారి సీరియస్**

- లెక్క తేల్చాలని ఆదేశాలు
- ప్రభుత్వ భూముల వివరాల సేకరణ
- అక్రమార్కులతో చేతులు కలిపిన అధికారుల్లో ఆందోళన



సాక్షి, మహబూబాబాద్: అధికారులు సర్కారు భూములను పరిరక్షించాలి. కానీ అదే అధికారులు వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో రోజుకో తీరుగా ఫిర్యాదులు రావడం, భూ ఆక్రమణలపై గొడవలు జరగడం.. ఇంతటితో ఆగకుండా సీఎం కార్యాలయం వరకు వెళ్లి వినతులు సైతం ఇచ్చారు. దీంతో భూ ఆక్రమణలపై పూర్తి నివేదిక తయారు చేయాలని భావించిన జిల్లా పాలనాధికారి ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందుకోసం అధికారులతో సమీక్షలు నిర్వహించి.. మొత్తం ప్రభుత్వ భూముల లెక్క తేల్చాని ఆదేశాలు సైతం జారీ చేసినట్లు సమాచారం.

**వరుస ఫిర్యాదులు...**
జిల్లా కేంద్రంలో మహబూబాబాద్, గుమ్మడూరు రెవెన్యూ గ్రామాల శివారులో 551, 287, 255, 557, 504, 39, 281 తదితర సర్వే నంబర్లలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. అయితే మహబూబాబాద్ రెవెన్యూ డివిజన్ జిల్లా కేంద్రంగా మారడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో కొందరు నాయకులు, అధికారుల దృష్టి ప్రభుత్వ భూములపై పడింది. తమకు తెలిసిన విద్యలతో భూములను కబ్జా చేయడం మొదలు పెట్టారు. ఇందుకు కొందరు అధికారులు కూడా సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ప్రభుత్వం, నాయకులు మారడంతో భూముల కబ్జాపై ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడం మొదులు పెట్టారు. ఒకరు బై నంబర్ వేసి కాజేశారంటే.. మరొకరు పట్టాభూమి నంబర్ ప్రభుత్వ భూమికి వేసి పట్టా చేయించుకున్నారని ఫిర్యాదులు చేసుకున్నారు. అలాగే చెరువు శిఖం, బఫర్‌జోన్లను రియల్ ఎస్టేట్ భూములుగా మార్చడం.. పక్కనే ఉన్న ప్రభుత్వ భూములకు ఎసరు పెట్టినట్లు ఆరోపణలు చేసుకుంటున్నారు. ఇలా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడం.. ఇక్కడి అధికారులు భూముల విషయం పట్టించుకోకపోవపడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు వెళ్లి కూడా ఫిర్యాలు చేసిన ఘటనలు ఉన్నాయి.

**వారిలో ఆందోళన..**
ప్రభుత్వ భూముల వివరాలు సేకరించాలని ఉన్నతాధికారి ఆదేశాలు జారీ చేయడంతో ఈ వ్యవహారంలో అక్రమార్కులతో చేతులు కలిపిన అధికారుల్లో ఆందోళన మొదలైంది. అయితే ఈ వ్యవహారంలో భాగస్వాములైన వారిలో కొందరు అధికారులు జిల్లా నుంచి బదిలీ అయ్యారు. మరికొందరు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో పని చేస్తున్నారు. అయితే భూముల వివరాలు లెక్కలు తీస్తే ఎవరి హయాంలో అవకతవకలు జరిగాయి.. ఏం చేశారు అనే విషయం బట్టబయలు అవుతుంది. దీంతో ఉన్నతాధికారి ముందు దోషిగా నిలబడాల్సి వస్తుందని భయపడుతున్నట్లు సమాచారం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భూముల లెక్కలు తేలుస్తారో.. గతంలో మాదిరిగా లెక్కలు తేల్చకుండా మభ్యపెట్టి కాలయాపన చేస్తారో వేచి చూడాలి.

**లెక్క తేల్చేందుకు...**
జిల్లాకు కొత్తగా వచ్చిన పాలనాధికారికి ప్రభుత్వ భూముల పరిరక్షణ, భూ అక్రమణలపై వస్తున్న ఫిర్యాదులు తొలనొప్పిగా మారినట్లు సమాచారం. దీనికి తోడు మానుకోట భూమల విషయంపై నిగ్గు తేల్చాని రాష్ట్ర స్థాయి అధికారులు కూడా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దీంతో ఉన్నతాధికారి జిల్లా కేంద్రంతో పాటు, ప్రధాన పట్టణాల్లోని ప్రభుత్వ భూముల లెక్కలు తీసే పనిలో ఉన్నట్లు సమాచారం. ఇందుకోసం సదరు అధికారి ఆ శాఖకు చెందిన పలువురు అధికారులతో సమీక్ష కూడా నిర్వహించారని ప్రచారం. 'మీరేం చేస్తారో... తెలియదు.. మొత్తం ప్రభుత్వ భూముల లెక్కలు తేల్చాలి. ఏ నంబర్‌పై ఎంత భూమి ఉంది.. అది ఎప్పుడెప్పుడు ఎవరెవరికి ఇచ్చారు. గతంలో సీపీఎం, సీపీఐ, న్యూడెమోక్రసీ, ప్రజాపంథ, ఎమ్మార్పీఎస్ మొదలైన కాలనీలకు ఎంత భూమి పోయింది. ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర అవసరాల కోసం కేటాయించిన భూమి ఎంత.. మొత్తం వివరాలు సేకరించాలి' అని ఉన్నతాధికారి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ప్రభుత్వ భూములే కాకుండా.. ప్రభుత్వ భూముల పక్కనే ఉన్న సర్వే నంబర్లు, వాటిల్లో నిజ భూమి ఎంత ఉంది.. పట్టాలు ఎన్ని ఎకరాలకు ఉంది.. ఇలా మొత్తం ఆరా తీసి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది.

## గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్


మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్: గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గణతంత్ర వేడుకల నిర్వహణపై అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయభావం ఉట్టిపడేలా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు పాటుపడాలన్నారు. జాతీయ పతాకావిష్కరణ, పోలీస్ గౌరవ వందనం, పరేడ్ కార్యక్రమాలను పోలీస్‌శాఖ చేపట్టాలన్నారు. ముఖ్య అతిథులకు ఆహ్వాన పత్రాలు అందజేయాలన్నారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసపత్రాలు అందించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ చెన్నయ్య, జెడ్పీ సీఈఓ రమాదేవి, డీఆర్‌డీఓ సన్యాసయ్య, జిల్లా ఉద్యాన శాఖాధికారి సూర్యనారాయణ, డీఈఓ రామారావు, అధికారులు పాల్గొన్నారు.

# పేదల బండి 'పుష్‌పుల్'

- తరచూ రద్దుతో ప్రయాణికుల ఇబ్బందులు


డోర్నకల్ స్టేషన్‌లో ఆగిన పుష్‌పుల్ రైలు(ఫైల్)

డోర్నకల్: విజయవాడ–డోర్నకల్–కాజీపేట మార్గంలో నడిచే పుష్‌పుల్ రైలు పేదల బండిగా గుర్తింపు పొందింది. విజయవాడ– కాజీపేట మధ్య ప్రతీ రోజూ వందలాది మంది ప్రయాణిస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారులు, కూలీలకు ఉదయం, రాత్రి అనుకూలంగా ఉండడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. అయితే కరోనా తర్వాత తరచూ రద్దు చేస్తుండడంతో ఉద్యోగులతో పాటు పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**లైన్ పనులతో...**
రైల్వే మూడో లైన్ నిర్మాణ పనులతో పాటు ఇతర కారణాలతో తరచూ పుష్‌పుల్ రైలును రద్దు చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డోర్నకల్ జంక్షన్ మీదుగా కొత్తగూడెం, వరంగల్, విజయవాడ మధ్య నడిచే పలు ప్యాసింజర్ రైళ్ల రద్దు కావడం, పుష్‌పుల్ రైలు తరచూ రద్దవుతుండడంతో ఇబ్బందులు పడుతున్నామని, ప్రతీరోజు పుష్‌పుల్ రైలును నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**నిత్యం నడపాలి..**



పేదలకు ఉపయోగకరంగా మారిన పుష్‌పుల్ రైలును రద్దు చేయకుండా ప్రతీ రోజూ నడపాలి. అన్ని వర్గాల వారికి అనువైన సమయంలో రైలు నడుస్తుండడంతో కూలీలు, వ్యాపారులు, ఉద్యోగులు ఆధారపడుతున్నారు.
– ఇమామ్, ప్రైవేట్ ఉద్యోగి, డోర్నకల్

## దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 2024–25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ మైనార్టీ అధికారి శ్రీనివాస్‌రావు బుధవారం తెలిపారు. జిల్లాని ఐదు మైనార్టీ గురుకులాల్లో ఇంగ్లిష్ మీడియంలో 5నుంచి 8వ తరగతుల్లో.. ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో సంబంధిత వెబ్‌సైట్‌లో ఈనెల18నుంచి ఫిబ్రవరి 6వతేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9885 983942, 7396691373 ఫోన్ నంబర్లు, దగ్గరలోని మైనార్టీ గురుకులాలను సంప్రదించాలని చెప్పారు.

## న్యూస్‌రీల్

### డీఎంహెచ్‌ఓ సందర్శన



నెహ్రూసెంటర్: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని అసంక్రమిత వ్యాధుల కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ అంబరీష బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 సంవత్సరాలు పైబడిన వారందరికీ స్క్రీనింగ్ చేసి బీపీ, షుగర్, కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసి, వ్యాధులను గుర్తించి మందులు అందజేయాలన్నారు. కేసుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. వ్యాధుల నిర్ధారణ పరీక్షలు, మందుల పంపిణీ వివరాల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ నాగేశ్వర్‌రావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కృష్ణార్జునరావు, సబ్‌యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్, డీపీఓ రుక్ముద్దీన్, కేవీరాజు, వైద్యాధికారి సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

### మానుకోట ఇన్‌చార్జ్ సీడీపీఓగా రాజ్యలక్ష్మి



మహబూబాబాద్: ఐసీడీఎస్ మానుకోట ప్రాజెక్ట్ ఇన్‌చార్జ్ సీడీపీఓగా రాజ్యలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పని చేసిన సీడీపీఓ డెబోరాను పలు కారణాలతో సంబంధిత శాఖ కమిషనర్ కార్యాలయానికి ఈనెల 3న సరెండర్ చేసిన విషయం విదితియే. కాగా సీనియారిటీ ప్రకారం ముగ్గురు ఏసీడీపీ పేర్లతో ప్రతిపాదనలు సంబంధిత కమిషనర్ కార్యాలయానికి పంపించినట్లు జిల్లా సంక్షేమాధికారి వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు మరిపెడ ఏసీడీపీగా పని చేస్తున్న రాజ్యలక్ష్మికి మానుకోట ఇన్‌చార్జ్ (ఎఫ్ఏసీ) సీడీపీఓగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వచ్చాయని తెలిపారు. ఈ మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించారు.

### ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు మేలు



తొర్రూరు రూరల్: ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా ఉద్యానశాఖ అధికారి సూర్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని కంఠాయపాలెం గ్రామ శివారులోని ఆయిల్ పామ్ తోటను, అరిపిరాల శివారులోని నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ.. భారతదేశంలోనే ఆయిల్ పామ్‌కు అధిక డిమాండ్ ఉందని, విదేశాలకు ఎక్కువ ఎగుమతి అవుతుందన్నారు. అందుకే తెలంగాణ ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకు మొక్కలు, డ్రిప్‌ను సబ్సిడీతో పాటు అనేక రకాల రాయితీలు ఇస్తుందన్నారు. ఈ ప్రాంతంలోని రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తూర్పాటి అంజయ్య, ఉద్యానశాఖ అధికారులు రాకేశ్, కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

### కలెక్టర్‌ను కలిసిన హుస్సేన్‌నాయక్



మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌ను బుధవారం బీజేపీ అనుబంధ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధికి అన్ని విధాలా సహకరించాలని కోరినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రాంచందర్‌రావు, గద్దం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**ఎస్పీని కలిసిన..**
మహబూబాబాద్ రూరల్: జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్‌ను బీజేపీ నేతలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి బొకే అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్ రావు, అర్బన్ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గుగులోతు రాంబాబు నాయక్, టౌన్ ప్రధాన కార్యదర్శి పల్లె సందీప్, వెన్నమల్ల సందీప్ తదితరులు ఉన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సిద్ధం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మరిపెడ: త్వరలో నిర్వహించే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. బుధవారం మరిపెడలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్‌రెడ్డి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియలో కార్యకర్తలు, నాయకులు క్రియాశీలకంగా పని చేయాలన్నారు. డోర్నకల్ నియోజకవర్గంలో అత్యధికంగా పట్టభద్రులు ఓటు వేసే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, నాయకులు షేక్ తాజుద్దీన్, కాలం రవీందర్‌రెడ్డి, కోట వెంకట్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, ఉప్పలయ్య, షేక్ అఫ్జల్, ఎంపీ అజీజ్‌పాషా, సత్యనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, దేవరశెట్టి లక్ష్మీనారాయణ తదితరుతు పాల్గొన్నారు.

## ఘనంగా గోదారంగనాథస్వామి కల్యాణం


గోదారంగనాథస్వామి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలం రెడ్యాల గ్రామంలోని సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో గోదారంగనాథస్వామి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి–బిందురెడ్డి, ఎన్నారై వెన్నం విజయకాంత్–రెడ్డిశిల్పారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అర్చకులు కిడాంబి నరసింహదేశికన్, కృష్ణకిశోర్ త్రిపాటి వేద మంత్రాల నడుమ కల్యాణం జరిపించారు. కల్యాణోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రనాయక్, మహబూబాబాద్, పాలకుర్తి ఎమెల్యేలు భూక్య మురళీనాయక్, మామిడాల యశస్వినిరెడ్డి, ఎన్నారై హనుమాండ్ల ఝాన్సీరెడ్డి హాజరై స్వామివారు, అమ్మవారిని దర్శించుకున్నారు.

## కారు, బైక్ ఢీ.. యువకుడి మృతి

- మరో నలుగురికి తీవ్ర గాయాలు

నూతనకల్: కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండల కేంద్రంలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లికి చెందిన తూర్పాటి గణేష్(23), పెండెం శ్రీను, దానబోయిన సమ్మయ్య, రోహిత్ మంగళవారం ఆత్మకూర్(ఎస్) మండలం ముక్కుడుదేవులపల్లిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో పాల్గొన్నారు. పోటీలు ముగిసిన తర్వాత రాత్రి పల్సర్ బైక్‌పై నలుగురు స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో నూతన్‌కల్ మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద తొర్రూరు నుంచి సూర్యాపేట వైపు వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్ నడుపుతున్న గణేష్ అక్కడికక్కడే మృతిచెందగా మిగిలిన ముగ్గురితో పాటు కారు డ్రైవర్ శ్రీనుకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై నరేష్ ఘటన స్థలాన్ని పరిశీలించి క్షతగాత్రులను 108 వాహనంలో సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రైల్వే ఆస్పత్రి తనిఖీ

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఆస్పత్రిని, కొత్తగా నిర్మిస్తున్న కాజీపేట సబ్ డివిజనల్ ఆస్పత్రి నిర్మాణ పనులను బుధవారం సికింద్రాబాద్ డివిజన్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ (సీఎంఎస్) డాక్టర్ అనురాధరెడ్డి తనిఖీ చేశారు. అనంతరం రైల్వే ఆస్పత్రి సీనియర్ డీఎంఓ డాక్టర్ ఐ.నిరంజన్‌రావు, ఇతర డాక్టర్లతో సమావేశమయ్యారు. ఆస్పత్రి అభివృద్ధి, పేషెంట్లకు కావాల్సిన వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. రైల్వే డాక్టర్లు నరేందర్ హిర్వాని, హరిబాబు, యాకూబ్, దీరజ్ పాల్గొన్నారు. కాగా, సీఎంఎస్ డాక్టర్ అనురాధరెడ్డికి కాజీపేట తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కొండ్ర నర్సింగరావు ఆధ్వర్యంలో రైల్వే కార్మిక కుటుంబాలకు కావాల్సిన వైద్య సదుపాయలపై వినతిపత్రం అందజేశారు. డాక్టర్లు, వైద్య సిబ్బందిని పెంచాలని, కంటి ఆపరేషన్‌లకు ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫరెల్ చేయాలని, ఆపరేషన్ థియేటర్‌ను అన్ని హంగులతో అత్యాధునీకరించి స్త్రీల వైద్య నిపుణులను నియమించాలని కోరారు.

# అంగన్‌వాడీలు.. అస్తవ్యస్తం

**కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కరువు**

- జిల్లాలో 1437 అంగన్‌వాడీలు.. అద్దె భవనాల్లో 492 సెంటర్లు
- పెండింగ్‌లో గ్యాస్, అద్దె బిల్లులు
- సమయ పాలన పాటించని టీచర్లు
- మినీ టీచర్ల అప్‌గ్రేడ్‌పై స్పష్టత కరువు


లెనిన్‌నగర్ కాలనీలోని అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం


సెంటర్‌లో ప్రమాదకరంగా నల్లా సంప్

మహబూబాబాద్: జిల్లాలో అంగన్‌వాడీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. చాలా వరకు సెంటర్లలో తాగునీటి సరఫరా, మరుగుదొడ్లు, విద్యుత్ కనెక్షన్ లేవు. గ్యాస్, అద్దె భవనాల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో టీచర్లు ఆందోళన చెందుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో టీచర్లు సమయపాలన పాటించడం లేదని ఆరోపణలు వస్తున్నారు.

**1,437 కేంద్రాలు..**
జిల్లాలో 1,437 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 341 కేంద్రాలు మాత్రమే సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. అలాగే 604 సెంటర్లు అద్దె లేకుండా ప్రభుత్వ పాఠశాలలు, పలు ప్రభుత్వ శాఖల భవనాల్లో కొనసాగుతుండగా.. మిగిలిన 492 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. 1,024 కేంద్రాలకు మాత్రమే తాగునీటి సరఫరా జరుగుతోంది. 488 కేంద్రాల్లో మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. 711 కేంద్రాలకు మాత్రమే విద్యుత్ కనెక్షన్ ఉంది. ఇలా అసౌకర్యాల మధ్య పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు.

**ఐదు ప్రాజెక్టులు..**
జిల్లా పరిధిలో మానుకోట, గూడూరు, డోర్నకల్, మరిపెడ, తొర్రూరు ప్రాజెక్టులు ఉన్నాయి. కాగా ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల లోపు పిల్లలు 20,306 మంది, మూడేళ్ల నుంచి ఆరు సంవత్సరాల పిల్లలు 13,963 మంది ఉన్నారు. గర్భిణులు, బాలింతలు కలిపి 8669 ఉండగా మొత్తంగా 42,938 మంది ఉన్నారని అధికారులు తెలిపారు. సూపర్‌వైజర్లు 58 మందికి గాను 49 మంది ఉన్నారు.

**స్పష్టత కరువు..**
జిల్లాలోని 152 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను గత ఏడాది డిసెంబర్ మాసంలో అప్‌గ్రేడ్ చేయగా అన్ని మెయిన్ కేంద్రాలు అయ్యాయి. ఆయా కేంద్రాల్లో పనిచేసే టీచర్లలో ఎక్కువ మందికి పదో తరగతి విద్యార్హత ఉంది. పదోన్నతులు కల్పించాలంటే తప్పనిసరిగా ఇంటర్ ఉండాలి. దానిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి గైడ్‌లైన్స్ రాలేదు. అలాగే ఆ కేంద్రాల్లో 152 మంది హెల్పర్ పోస్టుల భర్తీ చేయాల్సి ఉంది. హెల్పర్లకు కూడా ఇంటర్ విద్యార్హత ఉండాలి. కాగా ఆ పోస్టుల భర్తీకి నేటి వరకు నోటిఫికేషన్ రాలేదు.

**16న కలెక్టర్ సమీక్ష...**
ఈనెల 16న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్షించారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రానికి తాగునీటి సరఫరా, విద్యుత్ కనెక్షన్, మరుగుదొడ్డి ఉండాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతోనైనా కేంద్రాల్లో కనీస సౌకర్యాల కల్పన జరిగేనా అని పిల్లలు తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు.

**సరెండర్..**
మానుకోట సీడీపీఓ డెబోరా చేసిన అవకతవకల వల్ల గత కలెక్టర్ శశాంక ఆ శాఖ కమిషనర్ కార్యాలయానికి సరెండర్ చేశారు. రెండు నెలల పాటు గడువు ఇచ్చినా తన ప్రవర్తనలో మార్పు రాకపోవడంతోనే సరెండర్ చేసినట్లు జిల్లా సంక్షేమాధికారి వరలక్ష్మి తెలిపారు.

**పర్యవేక్షణ లోపం..**
సూపర్‌వైజర్ల పర్యవేక్షణ లోపంతో కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించడం లేదు. వాస్తవానికి ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు టీచర్లు కేంద్రాల్లో ఉండాలి. కానీ చాలా సెంటర్లు మధ్యాహ్నం వరకే మూసివేస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో టీచర్లు సూపర్ వైజర్లను మేనేజ్ చేసుకుని ఆయాలతో సెంటర్ల నిర్వహణ చేపడుతున్నారు. అలాగే సెంటర్లలో ఖాళీ స్థలం ఉంటే న్యూట్రిషన్ గార్డెన్ ఏర్పాటు చేయాల్సి ఉండగా.. చాలా వరకు ఏర్పాటు చేయలేదు.

**పెండింగ్‌లో బిల్లులు..**
కేంద్రాల్లో గ్యాస్ సిలిండర్ల బిల్లులు గత ఏడాది జూలై వరకు మాత్రమే వచ్చాయి. కాగా ఆరు నెలల గ్యాస్ బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. అద్దెభవనాల బిల్లులు గత ఏడాది ఆగస్టు వరకు రాగా నాలుగు నెలలు బిల్లులు నేటి వరకు పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రభుత్వం నుంచి బడ్జెట్ రాకపోవడంతోనే బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయని అధికారులు చెబుతున్నారు.

## రేపు వాహనాల వేలంపాట

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలకు శుక్రవారం వేలంపాట నిర్వహిస్తామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.చిరంజీవి బుధవారం తెలిపారు. వరంగల్ డిప్యూటీ కమిషనర్ జి.అంజన్ రావు, జిల్లా ఎక్సైజ్ అధికారి బి.కిరణ్ నాయక్ ఆదేశాల మేరకు ఉదయం 11.00 గంటలకు మహబూబాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలంపాట నిర్వహిస్తామని పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనే వారు ద్విచక్రవాహనాల కోసం రూ.20 వేలు, త్రీ వీలర్ కోసం రూ.30 వేలు, ఫోర్ వీలర్ కోసం రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాలని తెలిపారు.

## బస్టాండ్ కిటకిట..



మానుకోట బస్టాండ్ ప్రాంగణంలో వేచి ఉన్న ప్రయాణికులు

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని స్వగ్రామాలకు వచ్చిన వారు తిరిగి పట్టణాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో బుధవారం మానుకోట బస్టాండ్ ప్రాంగణం ప్రయాణికులతో కిక్కిరిసింది. బస్సుల రాకకోసం ఎదురుచూస్తు కనిపించారు.
– నెహ్రూసెంటర్


బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

## క్లుప్తంగా

### 108లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం


శివకుమార్

హన్మకొండ అర్బన్‌/కాశిబుగ్గ : 108 ఈ ఎంఆర్‌ఐ గ్రీన్‌ హెల్త్‌ సర్వీసెస్‌లో ఎమర్జెన్సీ మెడికల్‌ టెక్నీషియన్‌ (ఈఎంటీ) ఉద్యోగాల కోసం ఆసక్తి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి వరంగల్‌ జిల్లా 108 సేవల ప్రోగ్రాం మేనేజర్‌ శివకుమార్‌ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఎస్సీ (లైఫ్‌ సైన్స్‌, నర్సింగ్‌, ఎంఎల్‌టీ), బీఎస్‌ఎం, ఏఎస్‌ఎం చదివిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 19న ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగే ఇంటర్వ్యూలకు తమ ఒరిజినల్‌ సర్టిఫికెట్స్‌, ఒక జిరాక్స్‌ సెట్‌ కాపీతో హాజరుకావాలని వివరించారు. ఎంపికైన అభ్యర్థులు మొదటి మూడు నెలలు హైదరాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 91007 99258 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### నలుగురిపై గృహ హింస కేసు నమోదు

మహబూబాబాద్‌ రూరల్‌ : ఓ వివాహితను ఆమె భర్త, అత్త, మామ, ఆడపడుచు వేధింపులకు గురి చేయగా, బాధితురాలి ఫిర్యాదు మేరకు నలుగురిపై గృహ హింస చట్టం కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్‌ టౌన్‌ ఎస్సై టి. రామారావు బుధవారం తెలిపారు. పట్టణంలోని గోగుల మల్లయ్య బజార్‌లో నివాసం ఉండే రోజాకు నాలుగేళ్ల క్రితం మంచిర్యాల పట్టణానికి చెందిన మధిర నాగమహేష్‌ బాబుతో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.20 లక్షల నగదుతో పాటు కట్న కానుకలు ముట్ట చెప్పారు. వివాహం జరిగిన ఏడాది తర్వాత వారికి ఒక పాప జన్మించింది. అప్పటి నుంచి అదనపు కట్నం కావాలని ఆమె భర్త తో పాటు అత్త సుజాత, మామ వెంకటేశ్వరరావు, ఆడపడుచు దివ్య మానసికంగా హింసిస్తున్నారు. దీంతో మనస్తాపానికి గురైన రోజా.. నలుగురిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసిందని టౌన్‌ ఎస్సై తెలిపారు.

**మరో ఘటనలో ముగ్గురిపై..**

మహబూబాబాద్‌ రూరల్‌ : అదనపు కట్నం కోసం వేధిస్తున్న ముగ్గురిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు గృహహింస చట్టం కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్‌ రూరల్‌ ఎస్సై వి.దీపికారెడ్డి బుధవారం తెలిపారు. వరంగల్‌ రూరల్‌ జిల్లా చెన్నారావుపేట మండలం పాపయ్యపేటకు చెందిన మాచర్ల అనిల్‌ కుమార్‌కు మహబూబాబాద్‌ మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన నిరుపతో 2016 లో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.12 లక్షలు నగదు, 12 తులాల బంగారం, రూ.3 లక్షల విలువైన ఇంటి సామగ్రి అప్పజెప్పారు. కొంత కాలం నుంచి అదనపు కట్నం తీసుకురావాలని అనిల్‌.. నిరుపను వేధిస్తున్నాడు. ఇందుకు అతడి తండ్రి సమ్మయ్య, తల్లి భాగ్యమ్మ కూడా సహకరిస్తూ నిరుపను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ ఘటనపై బాధితురాలు నిరుప ఫిర్యాదు మేరకు ఆమె భర్త అనిల్‌ కుమార్‌, అత్త భాగ్యమ్మ, మామ సమ్మయ్యపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. కాగా, అనిల్‌ కుమార్‌ హైదరాబాద్‌లోని టీఎస్‌ఎస్పీ బెటాలియన్‌లో హెడ్‌ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు.



# పట్టుతప్పిన పాలన..

ఏఎంసీ ఏర్పాటు చేయక ఆరునెలలు..
- దృష్టి సారించని పర్సన్‌ ఇన్‌చార్జ్‌
- వెజ్‌ మార్కెట్‌ ప్లాట్ల ఎంక్వైరీ కథ కంచికేనా?
- మార్కెట్‌ వ్యవహారాలపై మంత్రి కొండా సురేఖ ఆరా..!


వరంగల్‌ వ్యవసాయ మార్కెట్‌ కార్యాలయం

వరంగల్‌ : ఆసియా ఖండంలోనే పేరొందిన ఏనుమాములలోని వరంగల్‌ వ్యవసాయ మార్కెట్‌లో పాలన పట్టుతప్పింది. మార్కెట్‌ కమిటీ పాలకవర్గం ముగిసి ఆరు నెలలు దాటింది. అయినా కొత్త పాలకవర్గం ఏర్పాటు చేయకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. మార్కెట్‌ కమిటీ పాలకవర్గం ముగిసిన వెంటనే కొత్త కమిటీని నియమించేందుకు అప్పటి నేతలు ప్రయత్నాలు చేసినా రిజర్వేషన్‌ కారణంగా పెండింగ్‌లో పడింది. ఫలితంగా కొత్త కమిటీ నియామకం కాకపోవడంతో మార్కెట్‌ వ్యవహారాలు పర్యవేక్షించేందుకు పర్సన్‌ ఇన్‌చార్జ్‌(పీఐసీ)గా జేడీఎం మల్లేషంకు రాష్ట్ర మార్కెటింగ్‌ శాఖ అధికారులు అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే పర్సన్‌ ఇన్‌చార్జ్‌గా జేడీఎం ఉన్నప్పటికీ ఆయన తన విధుల్లో బిజీగా ఉండడంతో మార్కెట్‌ కార్యదర్శి కనుసన్నల్లోనే పాలన మొత్తం సాగింది. పాలకవర్గ సమయంలో కూడా కమిటీలోని కొంత మంది సభ్యులకు మాత్రమే ప్రాధాన్యం లభించగా చైర్‌పర్సన్‌ సైతం పెద్దగా పాలన వ్యవహారాల్లో జోక్యం చేసుకోలేదు. సుమారు మూడేళ్లు బాధ్యతలు నిర్వర్తించినా అప్పటి కార్యదర్శి ఏం చెప్పినా మార్కెట్‌లో అదే జరిగింది. కార్యదర్శి హయాంలో కూరగాయల మార్కెట్‌ మారడం.. ఆ సమయంలో ప్లాట్ల కేటాయింపుల్లో ఎన్నో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వచ్చినా పట్టించుకున్న నాథుడే కరవయ్యారు. ఫలితంగా వారు ఆడిందే ఆట..పాడిందే పాట సాగిందన్న విమర్శలు వచ్చాయి. మోడల్‌ మార్కెట్‌లో ప్లాట్ల కేటాయింపులతో పాటు ఇతర పాలన వ్యవహారాల్లో అప్పుడు జరిగిన అక్రమాలను చిరువ్యాపారులు నూతన ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి వివరించినట్లు సమాచారం.

**ప్లాట్ల విచారణ కథ కంచికేనా...**

మోడల్‌ మార్కెట్‌లో ప్లాట్ల కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయని పెద్ద ఎత్తున ప్రచారం జరగడంతో అప్పటి చైర్‌పర్సన్‌ ఒక గ్రేడ్‌-2, 3 ఎఎస్‌లతో 2023 మే నెలలో విచారణ బృందాన్ని ఏర్పాటు చేసింది. విచారణ బృందం ముందు ప్లాట్లు పొందేందుకు ఎంత ఇచ్చారో వ్యాపారులు వెల్లడించారు. పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారాయని నిరూపణ రావడంతో అప్పటి వరకు సూపర్‌వైజర్‌గా పనిచేసిన ఉద్యోగిని గ్రేయిన్‌ మార్కెట్‌కు బదిలీ చేశారు. ప్లాట్ల కేటాయింపు సమయంలో ఉన్న కార్యదర్శి ఇక్కడ నుంచి రిలీవ్‌ అవుతూ చేసిన ఇటీవల అంతర్గత బదిలీల్లో మళ్లీ పాత సూపర్‌వైజర్‌ను కూరగాయల మార్కెట్‌కు పంపినట్లు సమాచారం. ప్లాట్ల కేటాయింపులతో సంబంధం ఉన్న ఉద్యోగి మళ్లీ విచారణ సమయంలో ఉంటే జరిగిన అక్రమాలు వెలుగుచూడవనే అభిప్రాయాలు వ్యాపారుల్లో వ్యక్తమవుతున్నాయి.

**మార్కెట్‌ వ్యవహారంపై 'మంత్రి' ఆరా..**

మోడల్‌ మార్కెట్‌లో బినామీలకు ప్లాట్ల కేటాయింపులు, ఆ సమయంలో జరిగిన అక్రమాలపై మంత్రి కొండా సురేఖ ఆరా తీస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. మార్కెట్‌ మారిన సందర్భంలో కొంత మంది వ్యాపారులు, ప్రజాప్రతినిధులుగా ఉన్న వారు అసలు వ్యాపార సంబంధం లేని వారు ఒక్కొక్కరు రెండు, మూడు ప్లాట్లు పొందడం, మార్కెట్‌లో పనిచేసే ఉద్యోగుల కుటుంబీకులకు ప్లాట్లు కేటాయించడంతో అసలు ప్లాట్లు రాని చిరువ్యాపారులు అధికారులకు, అప్పటి ప్రజాప్రతినిధులకు పలుమార్లు మొర పెట్టుకున్నారు. ఇందులో తమ పార్టీకి చెందిన నాయకుల హస్తం ఉన్న నేపథ్యంలో అప్పటి ముఖ్య ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని తెలిసింది. రాష్ట్రంలో ప్రభుత్వం, స్థానికంగా నాయకులు మారడంతో మోడల్‌ మార్కెట్‌లో జరిగిన ప్లాట్ల కేటాయింపులతో పాటు ఇతరత్రా విషయాలను చిరువ్యాపారులు ఇటీవల అధికారంలోకి వచ్చిన నేతల దృష్టికి తీసుకెళ్లారు. మోడల్‌ మార్కెట్‌లో జరిగిన అక్రమాలు, ప్లాట్ల కేటాయింపులపై పూర్తి వివరాలు మొత్తం అధికార పార్టీ నేత చేతుల్లోకి చేరినట్లు సమాచారం. ఇప్పటికే సంబంధిత అధికారులకు బినామీలను ఏరివేయడంతో పాటు అర్హులకు ప్లాట్లు కేటాయించాలని మంత్రి సురేఖ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. వరంగల్‌ వ్యవసాయ మార్కెట్‌లో మూడున్నరేళ్లలో జరిగిన అక్రమాలు, కేటాయింపులు, ఇతర విషయాలపై సమీక్ష నిర్వహించేందుకు అధికార పార్టీ నేతలు సమాయత్తం అవుతున్నట్లు తెలిసింది.

## నేటి నుంచి కోల్‌ ఇండియా హాకీ పోటీలు


పోటీలకు సిద్ధమైన అంబేడ్కర్‌ స్టేడియం

భూపాలపల్లి అర్బన్‌: కోల్‌ ఇండియా హాకీ పోటీలకు భూపాలపల్లి ఏరియా వేదికైంది. పోటీలకు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 11 కంపెనీల బొగ్గు గని కార్మిక క్రీడాకారులు హాజరుకానున్నారు. గురువారం (నేటి) నుంచి ఈ నెల 21 వరకు జరగనున్నాయి. ఏరియాలోని సింగరేణి అంబేడ్కర్‌ స్టేడియంలో ఈ పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏరియా సింగరేణి జనరల్‌ మేనేజర్‌ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించే ఈ పోటీల ప్రారంభోత్సవానికి సింగరేణి డైరెక్టర్లు హాజరుకానున్నారు. 21న జరిగే ముగింపు కార్యక్రమానికి సింగరేణి ఇన్‌చార్జ్‌ డీఎండీ బలరాం హాజరుకానున్నారు. కోల్‌ ఇండియా పరిధిలోని మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌, జార్ఖండ్‌, ఛత్తీస్‌గఢ్‌, ఒడిశా, వెస్ట్‌బెంగాల్‌, అసోం, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నారు.

## దేవుడి ఇత్తడి వాహనాల అపహరణ

- 200 కిలోల సొత్తును చోరీ చేసిన దుండగులు
- గుండెపుడి సీతారామచంద్రస్వామి ఆలయంలో ఘటన


తాళం పగులగొట్టి సొత్తు అపహరించిన ఆలయంలోని గది

మరిపెడ రూరల్‌: దేవుడి సేవలకు వినియోగించే ఇత్తడి వాహనాలను దుండగులు అపహరించారు. ఈ ఘటన మహబూబాబాద్‌ జిల్లా మరిపెడ మండలం గుండెపుడి సీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది.. స్థానికుల కథనం ప్రకారం..గుండెపుడిలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి 150 ఏళ్ల చరిత్ర ఉంది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రసిద్ధిగాంచిన ఈ దేవాలయంలో సేవలకు ఉపయోగించే గరుడ వాహనం, అశ్వవాహనం, ఆంజనేయస్వామి వాహనంతో పాటు అశ్వవాహనం గొడుగు మొత్తం నాలుగు ఇత్తడి వస్తువులు అపహరణకు గురయ్యాయి. దుండగులు దేవాలయం వెనుక భాగంలోని పల్లె ప్రకృతి వనం నుంచి ఆలయంలోకి ప్రవేశించారు. దేవాలయంలోని ఓ గదిలో ఉంచిన సుమారు 200 కిలోల బరువు కలిగిన ఈ సొత్తును గది తాళం పగులగొట్టి ఎత్తుకెళ్లారు. చోరీకి గురైన సొత్తు విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల లక్ష్మీనర్సింహాచార్యులు తెలిపారు. దీనిపై సమాచారం అందుకున్న మరిపెడ సీఐ రాజు సిబ్బందితో కలిసిఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టినట్లు తెలిపారు.

**గతంలో నాలుగుసార్లు పోయి దొరికాయి..**

గుండెపుడి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలోని సీతా, రామ, లక్ష్మణ మూలవిరాట్‌ విగ్రహాలు గతంలో నాలుగుసార్లు అపహరణకు గురై మళ్లీ దొరికినట్లు గ్రామ పెద్దలు వెల్లడించారు. 46 ఏళ్ల క్రితం గరుడ విగ్రహం చోరీకి గురై అనంతరం ఊరి శివారులో ప్రత్యక్షమైంది. రెండోసారి ఆలయంలోని మూలవిరాట్‌ విగ్రహాలు చోరీకి గురై ఖమ్మం జిల్లా పాలేరు చెరువులో జాలరులకు దొరికాయి. మూడోసారి చోరీకి గురై మిర్యాలగూడెం పోలీస్‌స్టేషన్‌ ద్వారా దొరికాయి. నాలుగోసారి గురైన విగ్రహాలు ఏపూరులో దొరికాయి. మళ్లీ ఇప్పుడు ఐదోసారి విగ్రహాలు కాకుండా దేవుని సేవలకు ఉపయోగించే వాహనాలు దుండగులు దోచుకెళ్లారు. ఎంతో మహిమ గల దేవాలయమని, పోయిన సొత్తు తిరిగి దేవాలయానికి చేరుతుందని గ్రామస్తులు చెప్పడం విశేషం.

## చెక్కు బౌన్స్‌ కేసులో మహిళకు ఆరునెలల జైలు

జనగామ: చెక్కు బౌన్స్‌ కేసులో జనగామ కోర్టు ప్రిన్సిపల్‌ ఫస్ట్‌క్లాస్‌ జ్యుడీషియల్‌ మెజిస్ట్రేట్‌ సుచరిత సదరు మహిళకు బుధవారం ఆరునెలల జైలుశిక్షతో పాటు రూ. 6 లక్షల జరిమానా విధించినట్లు న్యాయవాది శ్రీరాం శ్రీనివాస్‌ తెలిపారు. న్యాయవాది మాట్లాడుతూ ప్రేమ్‌సాగర్‌ అనే వ్యక్తి 2016 డిసెంబర్‌ 23న శ్రావణికి రూ.6 లక్షలు అప్పుగా ఇచ్చాడన్నారు. అప్పు తీసుకునే సమయంలో శ్రావణి.. ప్రేమ్‌సాగర్‌కు చెక్కును ఇచ్చారని స్పష్టం చేశారు. అప్పు తీసుకునే సమయంలో తిరిగి చెల్లించే తేదీ రావడంతో, ప్రేమ్‌సాగర్‌ చెక్కును తీసుకుని బ్యాంకుకు వెళ్లగా శ్రావణి ఖాతాలో నగదు లేకపోవడంతో బౌన్స్‌ అయినట్లు అధికారులు వెల్లడించారన్నారు. ఈ విషయం శ్రావణికి లీగల్‌ నోటీసు పంపించగా ఆమె నుంచి స్పందన రాకపోవడంతో జనగామ కోర్టును ఆశ్రయించారు. ప్రేమ్‌సాగర్‌ తరఫున న్యాయవాది శ్రీరాం శ్రీనివాస్‌ కోర్టులో వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న జడ్జి సుచరిత నిందితురాలికి ఆరునెలల సాధారణ జైలుశిక్షతో పాటు, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని పేర్కొన్నారు. రూ.6 లక్షలు చెల్లించని ఎడల, మరో రెండు నెలల పాటు జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. శ్రావణికి చెందిన అడ్వకేట్‌ అప్పీల్‌ కోరగా అనుమతి ఇచ్చినట్లు చెప్పారు.

### వాగులో మునిగి వ్యక్తి మృతి

నెల్లికుదురు: ఆకేరు వాగులో మునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్‌ కథనం ప్రకారం.. నెల్లికుదురు మండల కేంద్రానికి గుండగాని ఐలయ్య (50) మద్యానికి బానిసై రోజూ తన భార్యతో గొడవ పడుతుండేవాడు. దీంతో విసుగెత్తిన భార్య యాకమ్మ తన తల్లి గారి ఊరైన రాయపర్తి మండలం పెర్కవేడు గ్రామంలో ఉంటోంది. అక్కడ తన ఇద్దరు కుమారులతో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తోంది. కాగా, ఐలయ్యకు ఫిట్స్‌ ఉన్నాయి. ఈ క్రమంలో ఈనెల 15వ తేదీన గ్రామ శివారులోని ఆకేరు వాగులో చేపలు పట్టేందుకు వెళ్లి నీటిలో మునిగాడు. 17వ తేదీన నీటిలో తేలుతున్న మృతదేహాన్ని గ్రామస్తులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై మృతుడి భార్య యాకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### యామన్‌పల్లిలో గంజాయి పట్టివేత


నిందితుల అరెస్ట్‌ చూపుతున్న పోలీసులు

మహాముత్తారం: గంజాయి సరఫరా చేస్తున్న మహారాష్ట్రకు చెందిన ఇద్దరిని స్థానిక పోలీసులు అరెస్ట్‌ చేశారు. మహారాష్ట్రలోని పెంటిపాకకు చెందిన దుర్గం మిలింద్‌, దుర్గం సతీష్‌.. జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలో గంజాయి సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం యామన్‌పల్లిలోని ప్రధాన కూడలి వద్ద వీరిని అదుపులోకి తీసుకుని 980 గ్రాముల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం అరెస్ట్‌ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై సుధాకర్‌ తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్‌ రాజేందర్‌, మాషూక్‌, పంచాయతీ కార్యదర్శి వేణు తదితరులు ఉన్నారు.

# జాతర పనుల నాణ్యతలో రాజీలేదు

- భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు
- ఈనెలాఖరుకల్లా పనులన్నీ పూర్తి చేయాలి
- జాతరను సమష్టిగా విజయవంతం చేయాలి
- సమీక్ష సమావేశంలో మంత్రులు సురేఖ, సీతక్క


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సురేఖ

ఎస్‌ఎస్‌ తాడ్వాయి : మేడారం జాతర అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడే ప్రసక్తే లేదని, నాణ్యతగా ఉంటేనే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్‌, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం మేడారంలోని ఆదివాసీ భవన్‌లో రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి పనుల పురోగతిపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాజాతరలో భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న అభివృద్ధి పనులను గడువు లోగా పూర్తి చేయాలన్నారు. అలాగే, జాతరను ప్లాస్టిక్‌ రహితంగా పర్యావరణహితంగా నిర్వహించాలన్నారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించినట్లు, భక్తులకు కాటన్‌ సంచులు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. అన్ని సివిల్‌ పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. ట్రాఫిక్‌ సమస్య తలెత్తకుండా రోడ్డు నిర్మాణాలు, మరమ్మతులు, విస్తరణ పనులు వెంటనే చేపట్టి కంప్లీట్‌ చేయాలన్నారు.

**జాతర విజయవంతానికి కృషి..**

కాగా, ఈ సమీక్షకు ముందు మంత్రులు విలేకరులతో మాట్లాడుతూ అధికారులు, పూజారులు, స్థానిక యువత సహకారంతో జాతర విజయవంతానికి కృషి చేస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం జాతర అభివృద్ధికి రూ.75 కోట్లు కేటాయించిందన్నారు. అయితే గతేడాది కురిసిన వర్షాలకు జంపన్నవాగు వరదకు భారీగా నష్టం వాటిల్లిందని, దీనిని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులకు మరో రూ.30 కోట్లు అవసరమని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. జాతరలో శాశ్వత అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. అయినా అక్కసుతో సోషల్‌ మీడియాలో జాతరకు తక్కువ నిధులు కేటాయించారని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో కేసీఆర్‌ రూ.200 కోట్లు కేటాయించి మేడారాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చి పైసా కూడా ఇవ్వలేదని, పైగా ప్రతి జాతరకు నిధులు తగ్గించారని విమర్శించారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పడిన సమయానికి జాతరకు 60 రోజులునే ఉండగా రూ.75 కోట్లు కేటాయించిందన్నారు. మేడారానికి భక్తులు నిత్యం తరలివస్తున్నారని, వారి సౌకర్యార్థం శాశ్వత నిర్మాణాలు చేపడుతామన్నారు. జాతరను రాజకీయం చేయొద్దని, అందరి సహకారంతో విజయవంతం చేస్తామన్నారు. కాగా, మేడారం జాతరకు జాతీయ హోదా కల్పించేందుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కృషి చేయాలని కోరారు. సమావేశంలో కలెక్టర్‌ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్‌, ఐటీడీఏ పీఓ అంకిత్‌, ఎస్పీ శబరీష్‌, అడిషనల్‌ ఎస్పీ సదానందం, ఏఎస్పీ సంకీర్త్‌, ఓఎస్డీ అశోక్‌కుమార్‌, డీఎస్పీ రవీందర్‌, సీఐ శంకర్‌, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులకు శంకుస్థాపన..**

దేవాదాయశాఖ ఆధ్వర్యంలో రూ. కోటి 50 లక్షల వ్యయంతో నిర్మించనున్న సమ్మక్క- సారలమ్మ పూజారుల గెస్ట్‌ హౌస్‌ నిర్మాణానికి కలెక్టర్‌ ఇలా త్రిపాఠి, దేవాదాయశాఖ కమిషన్‌ అనిల్‌కుమార్‌, అడిషనల్‌ కలెక్టర్‌ శ్రీజ, పీఓ అంకిత్‌, ఎస్పీ శబరీష్‌తో కలిసి మంత్రులు సురేఖ, సీతక్క శంకుస్థాపన చేశారు. అనంతరం శానిటేషన్‌ షెడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో ఈఓ రాజేంద్రం, డీపీఓ వెంకయ్య, సూపరింటెండెంట్‌ క్రాంతికుమార్‌, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, పూజారులు, అధికారులు పాల్గొన్నారు.


శానిటేషన్‌ షెడ్డును ప్రారంభిస్తున్న మంత్రులు సురేఖ, సీతక్క

# సాక్షి క్లాసిఫైడ్స్

**SERVICES**

■ మెడికల్‌ షాప్‌ లైసెన్స్‌ ఉంది, కొత్తగా మెడికల్‌షాప్‌ పెట్టే వారికైనా లేదా పార్ట్నర్‌గా కావాలనుకునేవారు సంప్రదించండి: 9381352753 [W-1220964]

**CHANGE OF NAME**

■ I, AKKATI SAILAJA, W/o. Challa Indra Reddy (Old Name), H.No. 2-18, Anandnagar, Chinthagattu, Hanumakonda Dist, T.S.506015. I have changed my name from CHALLA INDRAJA W/o. Challa Indra Reddy (New Name) for all purposes. [W-788981]

**NAME CHANGE**

■ నేను అనగా (Old Name) భూక్యా రిక్విత్‌, S/o. భూక్యా వీరన్న, H.No. 3-57/B ఉల్లేపల్లి, భూక్యా తండ మం॥, మరిపెడ బంగ్లా జిల్లా, మహబూబాబాద్‌. ఈ రోజు నుండి నా కొత్తపేరుగా భూక్యా రిత్విక్‌, S/o. భూక్యా వీరన్న గా మార్చుకుంటున్నాము. [M-1190713]

**BUSINESS OFFER**

■ ద్వారకాఎంటర్‌ప్రైజెస్‌పేపర్‌ప్లేట్స్‌ & LEDమిషన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [G-1427]

**WANTED**

■ వరంగల్‌, హన్మకొండ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్‌ & సూపర్‌వైజర్స్‌ అర్జెంటుగా కావలెను. జీతం: 13,000 - 16,000. సంప్ర: 9000463426. [W-1220888]

4 లైన్ల క్లాసిఫైడ్‌ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

■ హరేకృష్ణ హోంకేర్‌, హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ : 18K. Ph: 9640258899, 9640468899 [H-793680]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌ టైమ్‌/ఫుల్‌ టైమ్‌గా వర్క్‌ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 91777 36926 [G-8443]

**ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి**

| | |
|---|---|
| హన్మకొండ | 9010144453 |
| వరంగల్‌ | 9705748198 |
| నర్సంపేట | 9553955722 |
| జనగామ | 9951602871 |
| మహబూబాబాద్‌ | 9010144453 |
| పరకాల | 9010299096 |
| జయశంకర్‌ భూపాలపల్లి | 9705748198 |

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## 'మల్లన్న' క్షేత్రంలో మహాసంప్రోక్షణ

- శ్వేత లింగానికి ఘనంగా అభిషేకాలు, అన్నపూజ


స్వామివారికి వస్త్రాలు సమర్పిస్తున్న కూనూరు పూజారులు మధు, సదాశివం

ఐనవోలు: ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో వైభవోపేతంగా జరిగిన సంక్రాంతి పండుగ జాతర ఉత్సవాలు ముగిశాయి. బుధవారం పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య మహాసంప్రోక్షణ ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్‌ ఆధ్వర్యంలో గర్భాలయాన్ని శుద్ధి చేయగా స్వామివారిని ఒగ్గు పూజారులు మేలు కొలిపారు. స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలు అలంకరించారు. వేకువజాము నుంచి గణపతి పూజ, పుణ్యాహవచనం, మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకాలు చేపట్టారు. మధ్యాహ్నం స్వామివారి లింగాకారాన్ని అన్నంతో అలంకరించి పూజలు నిర్వహించారు. దీంతో సంక్రాంతి నుంచి ఉగాది వరకు జరిగే జాతర, బ్రహోత్సవాల్లో మకర సంక్రాంతి నాలుగు రోజుల జాతర తొలి ఘట్టం ముగిసింది. నాలుగు రోజుల ఉత్సవాల్లో సుమారు 8 లక్షల మంది భక్తులు పాల్గొన్నారని ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు.

**ఉమామహేశ్వర ఆలయం నుంచి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పణ**

శ్రీమల్లికార్జున స్వామి, గొల్లకేతమ్మ, బలిజ మేడలమ్మ, భ్రమరాంభిక అమ్మవార్లకు సంప్రోక్షణ అనంతరం కూనూరు ఉమామహేశ్వరస్వామి ఆలయం నుంచి అర్చకులు మధు శర్మ, సదాశివశర్మ ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, వేద పారాయణ దారు గట్టు పురుషోత్తమ శర్మ, ముఖ్య అర్చకులు ఐనవోలు మధుకర్‌శర్మ, అర్చకులు నందనం మధు శర్మ, భాను ప్రసాద్‌, నరేష్‌ శర్మ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నిడిగొండలో విచిత్ర రోళ్లు

- గుట్ట దిగువన కనిపెట్టిన డిస్కవరీ మ్యాన్‌ రత్నాకర్‌రెడ్డి


రోళ్లను చూపుతున్న రత్నాకర్‌రెడ్డి

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండలోని గుట్ట దిగువన పరుపుబండపై విచిత్ర రోళ్లను కనుగొన్నాడు డిస్కవరీ మ్యాన్‌ రెడ్డి రత్నాకర్‌రెడ్డి. బుధవారం రోళ్లను కనిపెట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. 'గుట్ట దిగువన 20 వరకు ఉన్న ఈ రోళ్లు అండాకారంలో ఉండి కొంత ఏటవాలుగా ఉన్నాయి. మూడు నుంచి నాలుగు ఇంచుల లోతు ఉన్నాయి. ఇవి సాధారణంగా రోకలిబండతో నూరే రోళ్లు కావు. కొత్త రాతియుగం నాటి గ్రూవ్స్‌ కూడా కాదని' తెలిపారు. పరిశోధకులు గతంలో ఇలాంటివి హనుమకొండ జిల్లా కేంద్రంలోని పద్మాక్షిగుట్ట, అగ్గలయ్య గుట్ట, యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి గుట్ట, సూర్యాపేట జిల్లాలోని జలాల్‌పురం పరుపుబండపై గుర్తించారన్నారు. ఈ గుట్టలపై 12, 13 శతాబ్దంలో కోటలు, దేవాలయాలు నిర్మించినప్పుడు ఇవి కూడా అప్పటివే అయి ఉండవచ్చన్నారు. లోతైన పరిశోధన చేస్తే పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు.

## త్రిశూల స్నానం.. వైభవోపేతం


ఆలయంలో భక్తుల రద్దీ

- భారీగా తరలివచ్చిన భక్తజనం
- కిటకిటలాడిన కొత్తకొండ ఆలయం


చెంపలకు ఇనుప చువ్వలు గుచ్చుకొని హారతి వెలిగిస్తున్న కుమ్మరి వంశీయులు

ఎల్కతుర్తి: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో బుధవారం తిశూల స్నానం వైభవోపేతంగా జరిగింది. ముందుగా అర్చకులు స్వామివారికి గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపపూజ, పూర్ణాహుతి, కలశ ఉద్యాపన, అవబృత స్నానం, త్రిశూల స్నానం, హోమాలు, హారతి, మంత్రపుష్పం, బలిహరణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం త్రిశూల స్నాన ఘట్టం ప్రారంభం కాగా కుమ్మరి వంశీయులు స్వామి వారి నామస్మరణ చేస్తూ స్వామివారి పల్లేరం నిర్వహించారు. మేళతాళల మధ్య చేసిన పల్లేరు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్చారణాల మధ్య కోనేటిలో స్వామి వారి త్రిశూల స్నానం జరిపించారు. కోనేరులో భక్తులు స్నానాలు ఆచరించారు.

**కిక్కిరిసిన భక్తజనం..**

కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ ప్రాంగణ భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులకు సుమారు 2గంటల సమయం పట్టింది. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం కోనేటిలో నిర్వహించిన త్రిశూల స్నానాన్ని భక్తులు కనులారా తిలకించారు. కుమ్మరుల వంశీలు నాలుకపై శిలలు గుచ్చుకుని విన్యాసాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కిషన్‌రావు, సీఐ ప్రవీణ్‌కుమార్‌, ఎస్సై సాయిబాబు, ఎంపీపీ జక్కుల అనితారమేష్‌, జెడ్పీటీసీ వంగ రవీందర్‌, సర్పంచ్‌ దూడల ప్రమీల, ఎంపీటీసీ యాటపోలు రామణి, ముఖ్య అర్చకులు సదానందం, ఉప ప్రధాన అర్చకులు రాజయ్య, రాంబాబు, అర్చకులు శ్రీకాంత్‌, వీరభద్రయ్య, రమేష్‌, శివకుమార్‌, చరత్‌చంద్ర, శ్రావణ్‌కుమార్‌ పాల్గొన్నారు. కాగా, గురువారం తెల్లవారు జామున అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కిషన్‌రావు తెలిపారు.